సాక్షి
సిద్దిపేట
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



పెద్దల గెట్టు తాకని భూసేకరణ

ఇండస్ట్రియల్ పార్కు కోసం పెద్దల గెట్టు తాకకుండా పేదల భూములనే సేకరించడం విశేషం. వివరాలు 8లో ▸



షార్ట్ సర్క్యూట్‌తో..

షార్ట్ సర్క్యూట్‌తో కారుతో సహా మూడు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన సిద్దిపేటలో జరిగింది.

వివరాలు 8లో ▸



ఘనంగా పోచమ్మకు బోనాలు

బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్‌లో పోచమ్మ బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మిషన్ భగీరథ ఎస్ఈగా వెంకట్‌రెడ్డి



కలెక్టర్‌ను కలిసి మొక్కను అందిస్తున్న వెంకట్‌రెడ్డి

సిద్దిపేటజోన్: జిల్లా మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)గా వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల ఎస్ఈ చారి పదవీ విరమణ పొందడంతో మహబూబ్‌నగర్ జిల్లా గ్రిడ్ ఈఈగా పనిచేసిన వెంకట్‌రెడ్డి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ డీటీఓ

సిద్దిపేటరూరల్: జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన క్రిష్టఫర్ బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీటీఓగా ఉన్న కొండల్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. దీంతో గజ్వేల్ రవాణా శాఖ అధికారిగా కొనసాగుతున్న క్రిష్టఫర్‌ను ఇన్‌చార్జ్ డీటీఓగా ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న గరిమా అగర్వాల్

సిద్దిపేటజోన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రం భారత్‌నగర్‌లోని 35 రేషన్‌షాప్‌లో ఆమె సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇక ప్రతి నెలా సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని, పేదలు ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ, తహసీల్దార్ సలీమ్ మియ్యా పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ సీఐగా శ్యాంసుందర్



సీపీ అనురాధకు మొక్కను అందజేస్తున్న శ్యాంసుందర్

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ కమ్యూనికేషన్ సీఐగా శ్యాంసుందర్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శ్యాంసుందర్ సీపీ అనురాధను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని సీపీ సీఐకి సూచించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న వన్ టౌన్ సీఐ వాసుదేవరావు

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్‌లు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహనతోపాటు, అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పీఎస్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వాసుదేవరావు సూచించారు. సైబర్ జాగృక్ దివాస్ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థినులకు సైబర్ నేరాలపై బుధవారం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్, మేసేజ్‌లకు ఎవరూ స్పందించకూడదని తెలిపారు. ఏటీఎం పిన్, ఓటీపీ, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు ఇతరులకు తెలపకూడదని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లకూడదన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అతిథులొచ్చాయోచ్..



సైబీరియన్ కొంగ

విదేశాల నుంచి వలస వచ్చిన సైబీరియన్ కొంగలు సందడి చేస్తున్నాయి. దేశ వాలీ పక్షులతో కలిసి ఆహారాన్వేషణ సాగిస్తున్నాయి. పంట పొలాలు, అడుగంటుతున్న చెరువులు, కుంటల్లోని పురుగులను, చేపలను వేటాడి తింటున్నాయి. మండల కేంద్రమైన మిరుదొడ్డి పెద్ద చెరువులో సందడి చేస్తున్న దేశీయ పక్షులతో పాటు, సైబీరియన్ కొంగలను 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. – మిరుదొడ్డి(దుబ్బాక)





సిద్దిపేటలోని పరీక్ష కేంద్రం వద్ద ఆనందంలో విద్యార్థుల కేరింతలు.. (ఇన్‌సెట్‌లో) పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పరీక్షలు ముగిశాయోచ్..

విద్యార్థి దశలో కీలకమైన టెన్త్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21న ప్రారంభమైన 'పది' పరీక్షలు సాంఘీక శాస్త్రం పరీక్షతో పరిసమాప్తమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14,124 మంది విద్యార్థులకు 14,114 మంది పరీక్షలు రాశారు. చివరి పరీక్ష రాసి కేంద్రాల్లో నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు ఆకాశాన్ని జయించినంత ఆనందంగా కన్పించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. కాగా గురువారం ఒకేషనల్ పరీక్షలను 1763 మంది విద్యార్థులు రాయనున్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

మార్కెట్ల పంట పండింది

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పంటల ఉత్పత్తి పెరగడంతో పలు మార్కెట్లకు ఆదాయం పెరిగింది. గతేడాది వచ్చిన ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని మార్కెటింగ్ శాఖ జిల్లా పరిధిలోని 14 మార్కెట్లకు రూ.35 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఈ యేడాది మార్చి 31 నాటికి రూ.33.94కోట్లు ఫీజుల రూపంలో వసూలైంది. లక్ష్యానికి చేరువలోకి రావడమేకాక, గతేడాది కంటే ఎక్కువ ఆదాయం సమకూరింది.



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

జిల్లా వ్యాప్తంగా రూ.33.94 కోట్ల ఆదాయం

- గజ్వేల్‌లో ఎక్కువ.. తొగుటలో తక్కువ
- గతేడాది రూ.27.18 కోట్లే..
- లక్ష్యం చేరుకోని పలు మార్కెట్లు

సాక్షి, సిద్దిపేట: జిల్లాలోని 14 వ్యవసాయ మార్కెట్లలో ఫీజుల రూపంలో అధికంగా డబ్బులు వసూలు చేసి గజ్వేల్ టాప్‌లో నిలువగా, తొగుట మార్కెట్ లాస్ట్‌లో నిలిచింది. నిర్దేశించిన లక్ష్యం కంటే చిన్నకోడూరు, నంగనూరు, మిరుదొడ్డి, బెజ్జంకి, గజ్వేల్, చేర్యాలలో అధికంగా ఆదాయం వచ్చింది. కోహెడ, సిద్దిపేట, తొగుట, దౌల్తాబాద్, కొండపాక, దుబ్బాక, హుస్నాబాద్, ఒంటిమామిడి మార్కెట్లు మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. పౌరసరఫరాల సంస్థ ద్వారా ధాన్యం, మార్కెఫెడ్ ద్వారా పొద్దుతిరుగుడు గింజలు, సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు మార్కెట్ ఫీజులతో ఆదాయం మార్కెట్‌లకు వస్తోంది.

గతేడాది కంటే అధిక ఆదాయం



జిల్లాలో వ్యవసాయ శాఖ చెక్ పోస్టులను కట్టుదిట్టం చేశాం. కార్యదర్శులందరూ సమష్టి కృషితో గతేడాది కంటే అధిక ఆదాయం వచ్చింది. నిర్దేశించిన టార్గెట్‌ను పలు మార్కెట్లు చేరుకోలేదు. వాటిపై ప్రత్యేక ఫోకస్ పెడతాం. రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకువచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నాం.

– నాగరాజు, మార్కెటింగ్ అధికారి

వచ్చిన ఆదాయం వివరాలు.. (రూ.లలో)		
మార్కెట్	2024-25	2023-24
సిద్దిపేట	361.04	366.24
చిన్నకోడూరు	187.12	162.77
నంగనూరు	127.51	80.41
తొగుట	70.06	35.08
దౌల్తాబాద్	150.05	86.89
కొండపాక	138.29	73.00
మిరుదొడ్డి	141.92	58.27
దుబ్బాక	195.70	195.43
బెజ్జంకి	269.61	267.54
హుస్నాబాద్	456.57	403.47
కోహెడ	121.37	112.12
గజ్వేల్	481.23	346.73
చేర్యాల	481.04	357.84
వంటిమామిడి	212.76	173.06

పెరిగిన ఆదాయం

2023–24 సంవత్సరానికి రూ.27.18కోట్లు రాగా 2024–25కు రూ.33.94కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ.6.76 కోట్ల ఆదాయం పెరిగింది. మార్కెట్ ఫీజులు, లైసెన్స్ రెన్యూవల్స్, వ్యవసాయ శాఖ చెక్ పోస్టుల ద్వారా మార్కెట్లకు ఆదాయం వస్తోంది. పలు చోట్ల రైతు బజార్, సమీకృత మార్కెట్, మటన్, చికెన్, ఫిష్ మార్కెట్‌లతో పాటు గదుల అద్దెల ద్వారా, పశువుల సంత ద్వారా ఆదాయం సమకురుతోంది. దీంతో కొన్ని మార్కెట్లకు ప్రతి యేడాది ఆదాయం పెరుగుతూ వస్తోంది.

రాజ్యాంగాన్ని అవమానిస్తే సహించం



అక్కారంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రీతమ్, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తదితరులు

- బీజేపీ తీరును ప్రజల్లో ఎండగడతాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రీతమ్
- అక్కారంలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర
- పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: భారత రాజ్యాంగాన్ని అవమాన పరిచేవిధంగా పాలన కొనసాగిస్తున్న బీజేపీ తీరును ప్రజల్లో ఎండగడతామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రీతమ్ అన్నారు. టీపీసీసీ పిలుపుమేరకు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదంతో నిర్వహిస్తున్న గ్రామస్థాయి పాదయాత్రను బుధవారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతమ్ మాట్లాడుతూ నిండు పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా అవమానించారని మండిపడ్డారు. అంబేడ్కర్‌పై అహంకారపూరితంగా చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలంతా గమనించారన్నారు. గ్రామస్థాయి పాదయాత్రల ద్వారా బీజేపీ విధానాలను ప్రజల్లో తిప్పి కొడతామని హెచ్చరించారు. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాల్సిందే

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కాల్పులు జరిపిన వారిని శిక్షించాల్సిందేనని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. నిందితులను శిక్షించడంలో పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించే 'ప్రశ్నించే గొంతులు–అణచివేత'లపై నిరసన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని లింగుపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం గద్దర్ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్‌పై కాల్పులు జరిపిన వారిని శిక్షించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వమైనా దుండగులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు జోగ్గారి బాల్ నర్సు, నర్సింహులు, మహేష్, రాజు, భిక్షపతి, బాలరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తదితరులు తదితరులు

చలివేంద్రాలతో ఎంతో మేలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు సాయిరమాదేవి, స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: ఎండల తీవ్రత పెరుగుతోందని, నిత్యం గ్రామాల నుంచి కేసుల నిమిత్తం కక్షిదారులు వస్తుంటారని వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని న్యాయమూర్తి బుధవారం ప్రారంభించారు. అనంతరం కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో మంచినీటిని ఎక్కువగా తాగాలని సూచించారు. న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్‌కాంబ్లి, చందన, తరణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేష్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మరో చాన్స్

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు

సిద్దిపేటజోన్: ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ గడువును మరో నెల రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి31తో నిర్ణీత గడువు ముగిసినప్పటికీ ఇంకా పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని గుర్తించి ప్రభుత్వం మరొక అవకాశం కల్పించింది. ఏప్రిల్ 30 వరకు 25 శాతం రాయితీతో చెల్లించేలా రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ చేసుకొనేవారికి మరో ఛాన్స్.

ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని స్థానిక ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి సుజాతతో పాటు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుజాత మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారని, నూతన మండల కమిటీ సభ్యులు సైతం సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఆర్యవైశ్య ప్రముఖులు శ్రీనివాసరావు, వెంకటేశం, నాగజ్యోతి, రామకృష్ణ, లక్ష్మణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత

కోటి తలంబ్రాల దీక్ష అద్భుత ఘట్టం

జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక

గజ్వేల్‌రూరల్: కోటి తలంబ్రాల దీక్ష అద్భుత ఘట్టమని గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక అన్నారు. భద్రాచల సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా 250 కిలోల గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు రామకోటి రామరాజుకు ఆ దేవస్థాన పాలకమండలి అప్పగించింది. గోటి తలంబ్రాలను సిద్ధం చేసి తిరిగి భద్రాచలంలో అప్పగించేందుకు తీసుకెళ్తున్న సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని త్రిశక్తి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి ప్రియాంక మాట్లాడుతూ కోటి తలంబ్రాల దీక్షలో ప్రాంత ప్రజలను భాగస్వాములను చేయడం పట్ల రామకోటి రామరాజును అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రిశక్తి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



రామకోటి రామరాజుకు గోటి తలంబ్రాలను అందిస్తున్న జడ్జి ప్రియాంక

పాపన్న స్ఫూర్తితో అసమానతలపై పోరాడుదాం

కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అరుణ్

చేర్యాల(సిద్దిపేట): సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో నేటి యువత సమాజంలోని అసమానతలపై పోరాడాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ సూచించారు. బుధవారం పాపన్న 315వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అరుణ్ మాట్లాడుతూ సామాన్య కల్లు గీత కార్మిక కుటుంబంలో పుట్టిన పాపన్న సమాజం బాగుండాలని కోరుకున్నారని, అందు కోసం కల్లు గీసే కత్తిని పక్కన పెట్టి ఖడ్గం చేతపట్టాడన్నారు. మొగలు సైన్యంపై తిరగబడి విజయం సాధించి ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సమాజంలో జరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గీత కార్మికులను పట్టించుకోవడం లేదని, రోజు రోజుకూ గీత వృత్తి అంతరించిపోతోందన్నారు. భారత రాజ్యాంగంలో అంబేద్కర్ చెప్పిన విధంగా అన్ని రంగాల్లో సమానత్వం కోసం పాటుపడాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సర్వాయి పాపన్న, కంటమయ్య, రేణుక ఎల్లమ్మల స్ఫూర్తితో ఉద్యమం చేస్తామని అందుకు గీత కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, కనకయ్య, సిద్దిరాములు, బుచ్చిరాములు, గణేష్, రాములు, రాజు, సత్తయ్య, రాజయ్య, గోపాల్, ఐలయ్య, యాదగిరి, నరేష్, శ్రీనివాస్, చందు, వెంకటేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అరుణ్, గీత కార్మిక సంఘం నాయకులు

క్లుప్తంగా

మెర్సిడెస్ బెంజ్ బీవీజనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపిక


స్వామినాథన్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌కు చెందిన రవీందర్ బాలమణి దంపతులు కుమారుడు జెత్ర స్వామినాథన్ ప్రతిష్టాత్మకమైన మెర్సిడెస్ బెంజ్ బీవీ జనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఒక వెయ్యి మంది యువ ఇన్నోవేటర్లను మెర్సిడెస్ బెంజ్ బీవీజనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపిక చేస్తుంది. ఇందులో భాగంగా స్వామినాథన్ ఎంపికై తన ప్రతిభను చాటాడు. దేశ రాజధాని ఢిల్లీ, ముంబాయితో పాటు జర్మనీ వంటి దేశాల్లో జరిగే ప్రపంచ స్థాయి ఇన్నోవేటర్లతో జరిగే సమావేశాల్లో స్వామినాథన్ పాల్గొననున్నాడు. రాష్ట్రం నుంచి స్వామినాథన్ ఎంపిక కావడంపై ఖాజీపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నర్సాపూర్: గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపారు. నర్సాపూర్‌లోని జగన్నాథరావు కాలనీలో నివాసం ఉండే వెంకటేష్ ఇంట్లో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందింది. బుధవారం సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా ఇంట్లో 310 గ్రాముల గంజాయి దొరికిందని, వెంటనే అరెస్టు చేసి ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఖాజా పాషకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో తనతోపాటు ఎస్ఐ బాలయ్య, ఇతర సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, రవి, నవీన్, నరేశ్ పాల్గొన్నారని సీఐ తెలిపారు.

అతిగా మద్యం తాగి పర్మిట్ రూమ్‌లోనే మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అతిగా మద్యం సేవిస్తూ పర్మిట్ రూమ్‌లోనే అపస్మారక స్థితికి చేరుకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట శివారులో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ నర్సింహులు కథనం మేరకు.. హత్నూర మండలం సిరిపుర గ్రామానికి చెందిన గంగిరెద్దుల భాషా (45) వడ్డె మల్లయ్య, గంగిరెద్దుల గోవిందులతో కలిసి జగ్గంపేటలో గల ఎస్‌వీఆర్ వైన్స్‌లో గల పర్మిట్ రూమ్‌లో అతిగా మద్యం సేవించి కింద పడిపోయి ఉన్నాడు. విషయం తెలుసుకున్న భాషా కుమారుడు అంబదాసు వచ్చి తండ్రిని లేపగా లేవకపోవడంతో వైద్యుడిని పిలిపించాడు. డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

తూప్రాన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన అరకల శ్రీనివాస్(56) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి తిని పడుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి కొంపల్లిలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 12 మంది మద్యం తాగి పట్టుబడ్డారు. వీరిని బుధవారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం 12 మందికి రూ. 8,700 జరిమానాతో పాటు ఓ వ్యక్తికి రెండ్రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పెద్దల గెట్టు తాకని భూసేకరణ

పరిశ్రమల సాకుతో పేదల భూములకు ఎసరు

- వైఎస్సార్ రుణమాఫీతో పేదలకు భూమి హక్కులు
- బోర్లు వేసుకొని పంటలు సాగు
- ఇండస్ట్రియల్ పార్కుతో పేదల ఆందోళన
- వదిలేయాలని బాధితుల డిమాండ్



ఈ ఫొటోలో కనిపించే రైతు పేరు వైనాల రాకేశ్. ఇతడి తండ్రి అశోక్‌కి 1995లో దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలుకు రుణం ఇచ్చింది. అశోక్‌కు 2 ఎకరాల భూమి ఇయ్యడంతో అందులో బోరు వేసుకొని పంటలు సాగు చేసి జీవిస్తున్నాడు. 15 ఏళ్ల కిందటనే అశోక్ మరణించడంతో ఈ భూమిలోనే వ్యవసాయం చేసుకొని తల్లి, కొడుకు బతుకుతున్నారు. ప్రభుత్వం ఇండస్ట్రియల్‌కు వారి భూమి తీసుకుంటుందని తెలువడంతో పేద కుటుంబం ఆందోళన చెందుతుంది. తోటపల్లి శివారులోని మా భూమి వదిలేయాలని ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నారు.


తోటపల్లి శివారులోని దళితుల పచ్చని పంటలు

గ్రామం	ఎకరాలు	రైతులు
చౌటపల్లి	83.36	120
జనగామ	15.20	08
తోటపల్లి	25.20	31
మొత్తం	124.36	159

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి, టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడానికి భూమి కావాలని రెవెన్యూ అధికారులను కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు కనీసం 105 ఎకరాల వరకు అవసరం ఉంటుందని చెప్పారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో 312 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి 83.36 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు సూచించారు. ఇదే మండలం జనగామ శివారులో 15.20 ఎకరాలను సేకరణకు రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. అలాగే, హుస్నాబాద్ మండలం తోటపల్లి శివారులో 25.20 ఎకరాల భూమిని సేకరించడానికి అధికారులు సర్వే చేశారు. మొత్తం 124 ఎకరాల 36 గుంటలకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసి 15 రోజుల కిందట మొదటి దఫా గ్రామ సభ చౌటపల్లిలో ఏర్పాటు చేశారు. రైతులు మా భూములు ఇయ్యమని వ్యతిరేకించడంతో మరోసారి గ్రామ సభ ఏర్పాటు చేయొచ్చని అధికారులు వెళ్లిపోయారు.

పరిశ్రమల సాకుతో పేదల భూమికి ఎసరు..

చౌటపల్లి సర్వే నంబరు 312లో 83.36 ఎకరాల అసైన్డ్ భూముల సమస్యల రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. పట్టాలు ఒకరికి ఉంటే మోకాపై మరొకరు ఉండటంతో రికార్డుల ప్రక్షాళన సమస్య జటిలంగా మారింది. ఈ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకొంటే సమస్యకు ముగింపు పలుకొచ్చని అధికారుల ఆలోచనకు కొందరు గ్రామస్తులు మద్దతు ఇవ్వడంతో భూసేకరణ జరుగుతుంది. 1995లో ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేదలకు భూ కొనుగోలుకు రుణాలు ఇవ్వడంతో తోటపల్లి శివారులోని 12 మందికి 24 ఎకరాల భూమిని కొని ఇచ్చారు. పంటలు సాగు చేసుకుంటూ రుణాలను చెల్లిస్తూ వచ్చిన పేదలకు 2005లో వైఎస్సార్ సీఎం అయిన తర్వాత రుణ మాఫీ చేయడంతో పేదలకు రుణ విముక్తి కలిగి భూముల పై హక్కుల వచ్చాయి. భూములు మావే అనే భరోసాతో బతుకుతున్న దళితులకు చెందిన 14 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్కు కోసం తీసుకుంటున్నామని అధికారులు చెప్పగానే దళిత కుటుంబాల్లో ఆందోళన మొదలైంది.

పెద్దల జోలికి వెళ్లని అధికారులు

ఇండస్ట్రియల్ పార్కు కోసం సేకరించే భూములు పెద్ద గెట్టు తాకకుండా పేదల భూములనే సేకరించడం విశేషం. తోటపల్లి శివారులో రోడ్డుకు రెండు వైపుల భూములు ఉన్నప్పటికీ పెద్దలవి వదిలేసి పేదల వ్యవసాయ భూములు, రోడ్డు పక్కనే 11 మంది నివాస స్థలాలు 22 గుంటలను కూడా సేకరణలో నమోదు చేశారు. ఒక్కొక్క ప్లాటుకు రూ.7 లక్షలకు కొనుగోలు చేస్తే ప్రభుత్వం ఎంత పరిహారం ఇస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైసా పైసా కూడబెట్టి భూమి కొన్న



ఇక్కడ పని లేక బతకడానికి పదేళ్లు దుబాయి పోయి పైసా పైసా కూడబెట్టి తోటపల్లి శివారులో 3.20 ఎకరాలు కొని వ్యవసాయం చేస్తున్న. ఇప్పుడు మా భూములు ఇయ్యమంటే ఏట్లా ఇస్తరు. రోడ్డు పక్కన దొర భూములకు పోతలేరు అది రోడ్డు పక్కనే ఉండే ఆ భూములకు పోరు మా బక్కోల్ల భూమి తీసుకుంటారు. పచ్చటి పంటలు పండే భూముల్లో పరిశ్రమలు పెడితే ఎట్లా.

– చుంచు శంకర్, చౌటపల్లి

ఎక్కడ పోయి బతకాలే



ఎస్సీ కార్పొరేషన్ లోను ఇస్తే బాకి తీర్చడానికి పదేళ్లు పట్టింది. మిగిలిన లోను వైఎస్సార్ రుణమాఫీ చేయడంతో తీరిపోయింది. అప్పటి నుంచి మాకు పట్టా పాసు బుక్‌లు రావడంతో బోర్లు ఏసి సదను చేసి పంటలు పండిస్తున్నాం. పచ్చని పంట చేళ్లలో పరిశ్రమ పెడుతామంటే ఏట్లా..? మేం ఎక్కడ పోయి బతుకాలే మాకు భూములు ఎవరు ఇస్తరు.

– చుంచు లక్ష్మయ్య, చౌటపల్లి

రూ.15 లక్షలకు రెండు గుంటలు కొన్న



హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల మధ్య ఊరు భవిష్యత్‌లో వ్యాపారానికి అనువైన ప్రదేశమని రూ.15 లక్షలకు రెండు గుంటలు కొన్న. ఇప్పుడు పరిశ్రమలకు ఇయ్యమంటే ఏట్లా? మా పక్కనే రోడ్డు కింది భూమి ఎందుకు తీసుకోవడం లేదు. భూ సేకరణ చేస్తే సమాన హద్దులతో భూమి తీసుకొంటే బాగుంటది. పలుకుబడి వాళ్ల భూములు వదిలి మా ఇంటి స్థలాలు కావాల్సి వచ్చిందా.

– వెంకటేశ్వర్లు, హుస్నాబాద్

భూ సేకరణ ప్రక్రియ జరుగుతోంది



ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 105 ఎకరాల భూమి కావాలే అని అడిగారు. మూడు చోట్ల కలిసి మొత్తం 124 ఎకరాలను భూ సేకరణకు గుర్తించాం. ఇందులో 14 ఎకరాల వరకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి పొందిన భూములు ఉన్నవి మిగితా పట్టా భూములను కూడా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. పరిహారం ప్రభుత్వ నిర్ణయం మీదనే ఆధారపడి ఉంటుంది.

– రాంమూర్తి, ఆర్డీవో, హుస్నాబాద్

పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్ రెడ్డి

తొగుట(దుబ్బాక): వ్యవసాయ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల నాయకులతో కలిసి మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు నిలిచిపోయినా దుబ్బాక కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమది రైతు ప్రభుత్వ మంటూ ఊదరగొట్టే కాంగ్రెస్ నాయకులకు రైతుల బాధలు తెలియవా అని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మార్క్ ఫెడ్ జిల్లా అధికారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించామని ఆదేశాలు రాగానే కొనుగోలు ప్రారంభిస్తామని జిల్లా అధికారి వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చందూగౌడ్, పరమేష్, లక్ష్మణ్, సందీప్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళపై అత్యాచారయత్నం

సంగారెడ్డి: గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేయబోయాడు ఓ అగంతకుడు. ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కథనం మేరకు.. పుల్‌కల్ మండలం గొంగళూరు తండాకు చెందిన అనిత అనే గిరిజన మహిళ సంగారెడ్డికి కూలీ కోసం వచ్చింది. ఆమెను పని ఉందని చెప్పి ఓ అగంతకుడు బొమ్మారెడ్డి గూడెం తండా ప్రాంతానికి అత్యాచారం చేయబోయాడు. ఈ క్రమంలో దాడి చేయగా ఆమె గాయపడింది. అగంతకుడి చెర నుంచి బయటపడిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అగంతకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని, ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చెరువులో మునిగి బీటెక్ విద్యార్థి మృతి

- కాలక్షేపం కోసం నర్సాపూర్ వచ్చిన 8 మంది విద్యార్థులు
- కాళ్లు కడుక్కుంటుండగా నీట మునిగి మృత్యువాత
- మృతుడిది హైదరాబాద్‌లోని గాజుల రామారం


విద్యార్థి మనీశ్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: చెరువులో మునిగి బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన నర్సాపూర్ రాయరావు చెరువులో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ లింగం కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గాజుల రామారానికి చెందిన మనీశ్(19) బీవీఆర్ కళాశాలలో బీటెక్ సెకండర్ ఇయర్ చదువుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. ముందే స్నేహితులతో వేసుకున్న ప్లాన్ ప్రకారం అతడి మిత్రులు హరి శంకర వరప్రసాద్, ప్రియాకర్, కౌటిల్య, సంజయ్, సాత్విక్, రాగ, తన్వి మొత్తం 8 మంది కలిసి నర్సాపూర్ రాయరావు చెరువు వద్దకు వచ్చారు. అక్కడ కట్టపై ఉన్న పార్కులో కాలక్షేపం చేసి అనంతరం మధ్యాహ్నం చెరువు తూము వద్ద ఉన్న మెట్లపై నుంచి నీటి అంచుకు చేరుకున్నారు. మెట్లపై నుంచి నీటిలో కాళ్లు పెట్టి సరదాగా ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మనీశ్ నీటిలో పడిపోయి మునిగిపోయాడు. మిత్రుడు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్ల సాయంతో మనీశ్ మృతదేహాన్ని బయటకు తీశారు. రాయరావు చెరువు వద్దకు వచ్చి కాలక్షేపంతోపాటు విద్యార్థులు మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు


ఘటనా స్థలంలో బైక్‌లు

నిజాంపేట(మెదక్): రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట్ గ్రామానికి చెందిన చింతకింది భాను స్వగ్రామం నుంచి పులిమామిడికి బైక్‌పై పని నిమిత్తం వెళ్తున్నాడు. కల్వకుంట్ల గ్రామ శివారులోకి రాగానే నార్లాపూర్ గ్రామానికి చెందిన బెజమైన వెంకటేశ్ బైక్‌పై అజాగ్రత్తగా వచ్చి భాను బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భానుకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి చిన్నాన్న రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

యువకుడు మృతి, మరో యువకుడికి తీవ్ర గాయాలు


ప్రమాదస్థలంలో బస్సు, బైక్

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని కిచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మద్దూరి అనిల్ కుమార్ (25)కుమ్మరి అనిల్ కుమార్ (26) బైక్‌పై కిచ్చనపల్లి గ్రామానికి వెళ్తున్నారు. అన్నాసాగర్ చెరువుకట్ట వద్దకు రాగానే నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మద్దూరి అనిల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా , మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జోగిపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ కుట్ర

- బడుగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

జగదేవ్‌పూర్(గజ్వేల్): రిజర్వేషన్లు ఎత్తి వేయడానికి బీజేపీ కుట్ర చేస్తుందని, కుట్రను తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. బుధవారం మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించి అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలాలు వేసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, ఎడ్లబండ్లు, భూముల పంపిణీ చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన మోదీని దళిత సమాజం క్షమించదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీలకు 18 శాతం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించి దళితులను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, జనార్ధన్‌రెడ్డి, పద్మారావు, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు..గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్(40)కు ఏడేళ్ల కిందట సిద్దిపేటకు చెందిన లావణ్యతో వివాహం జరుగగా వీరికి మూడేళ్ల కూతురు ఉంది. కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్న శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. లావణ్య రెండేళ్ల కిందట గొడవ పడి తల్లిగారింటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు లావణ్యను తిరిగి ఇంటికి తీసుకురావాలని మాట్లాడుకుంటుండగా 31న రాత్రి శ్రీనివాస్ పురుగుల మందు తాగి వస్తుండడాన్ని గమనించారు. వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమయం చాలా విలువైంది

గజ్వేల్‌రూరల్: సమయం ఎంతో విలువైందని, వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సీఐ సైదా పిలుపునిచ్చారు. స్థానిక ఓ టాలెంట్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు షీ టీమ్, మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు భవన నిర్మాణ కార్మిక మహాసభ

కొమురవెల్లి(సిద్దిపేట): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిద్దిపేటలోని శ్రామికభవన్‌లో గురువారం జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బాలమోహన్, భూమయ్య, అంజయ్య పాల్గొన్నారు.

480 మందికి వైద్య పరీక్షలు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో సురభి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 480 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లకు నిబంధనలు తప్పనిసరి

గజ్వేల్‌రూరల్: రోడ్డు నిబంధనలను పాటిస్తూ అంబులెన్స్‌లను నడపాలని ట్రాఫిక్ సీఐ మురళీ సూచించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద బుధవారం అంబులెన్స్ డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

పునః ప్రతిష్ఠ చేపట్టడం శుభ సూచకం

మాధవానంద సరస్వతీ స్వామిజీ


యంత్ర ప్రతిష్ఠ చేస్తున్న మాధవానంద సరస్వతీ

దుబ్బాక: నరుడు నారాయణుడై ధర్మరక్షణ చేస్తే ఈ మానవజన్మకు సార్థకత లభిస్తుందని మాధవానంద సరస్వతీ స్వామిజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. దుబ్బాక పట్టణంలో నూతనంగా నిర్మించిన వరద పోచమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహానికి మాధవానంద సరస్వతీ స్వామిజీ యంత్ర ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ఆలయాలు నిర్మించి విగ్రహాలు ప్రతిష్ఠిస్తే సరిపోదని నిరంతరం ధూప, దీప నైవేద్యాలతో వెలుగొందేలా చూసినప్పుడే భగవంతుడు మనను చల్లగా చూస్తాడన్నారు. ఎన్నో వందల ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయం శిథిలం కాగా భక్తులు ముందుకొచ్చి నూతనంగా ఆలయంతోపాటు అమ్మవారిని పునః ప్రతిష్ఠ చేసుకోవడం శుభ సూచకమన్నారు. అంతకు ముందు ఆలయంలో వేదపండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అవాహిత దేవతా పూజ, హోమములు, అదివాసములు, ఆదివాస హోమం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పురాణేతిహాసాల్లో ప్రసన్న కథాకలితార్థయుక్తి

అష్టావధాని బ్రహ్మశ్రీ గౌరిభట్ల రుక్మిణీ బాలముకుందశర్మ


బాలముకుందశర్మను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

సిద్దిపేట ఎడ్యుకేషన్:పురాణేతిహాసాలలో ప్రసన్న కథాకలితార్థయుక్తి కల్గి ఉందని, అభినవశుక పండిత, సమన్వయ సార్వభౌమ బిరుదాంకితులు, అష్టావధాని బ్రహ్మశ్రీ గౌరీభట్ల రుక్మిణీ బాలముకుందశర్మ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రాచీన సాహిత్యం – కవితారీతులు అనే సదస్సులో పురాణేతిహాసాలలో ప్రసన్న కథాకలితార్థయుక్తి అనే అంశంపై బాలముకుంద శర్మ ప్రసంగించారు. నన్నయ గారి కవితా లక్షణాల్లో మొదటిదైన ప్రసన్న కథాకలితార్థయుక్తి. ఈ లక్షణం నన్నయకు ముందే పురాణేతిహాసాల్లో కనిపిస్తుందని నిరూపించడం ఈ ఉపన్యాస లక్ష్యం. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి, తెలుగు విభాగ అధ్యాపకులను అభినందిస్తూ ప్రాచీన సాహిత్యం పైన విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో పిట్ల దాసు, వెంకటరమణ, సంపత్, రామస్వామి, నరేశ్, నర్సింలు, శైలజ, రమణ, సాయి సురేశ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనాలు దగ్ధం

- కారు, మూడు ద్విచక్రవాహనాలు కాలి బూడిద
- రూ.15 లక్షల ఆస్తి నష్టం


ప్రమాదంలో కాలిపోయిన కారు, బైకులు

సిద్దిపేటఅర్బన్: ఓ ఇంటిలో జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు సహా మూడు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలోని మారుతీనగర్‌లో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సీఐ విద్యాసాగర్ తెలిపిన కథనం మేరకు.. సిద్దిపేట పట్టణంలోని మారుతీనగర్‌లో బెల్లంకొండ వెంకటేశ్వర్‌రావు ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ మీటర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. కాసేపటికి మంటలను గుర్తించిన సురేశ్ అనే వ్యక్తి ఇంట్లోకి మంటలు వ్యాపిస్తున్నాయనే ఆందోళనతో ఫస్ట్ ఫ్లోర్ నుంచి కిందకు దూకగా స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం చుట్టుపక్కల వారి సాయంతో ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పివేయగా అప్పటికే వరండాలో పార్కింగ్ చేసిన కారు సహా మూడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. వీటితో పాటు కింది పోర్షన్ డోర్లు, మూడు విద్యుత్ మీటర్లు, వైర్లు, బోర్ స్టార్టర్, డ్రైనేజీ పైపులు బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటేశ్వర్‌రావు వాపోయారు. కాగా విద్యుత్ మీటర్లలో తలెత్తిన సమస్య వల్లే షార్ట్ సర్క్యూట్ జరిగినట్టు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ నర్సింహులు పేర్కొన్నారు. బాధితుడు వెంకటేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలపై సీఐ విద్యాసాగర్ ఆరా తీశారు.